
## సింగిల్ పేజీ కథలు

# నమ్మకం



"సుందరీ!.... (నీ పేరు తెలీక నీ రూపంతో ఈ సంబోధన) తొలిచూపులో ఆకట్టుకుని, మలిచూపులో నన్ను కట్టిపడేసుకున్న నీ అందం కలలో, ఇలలో నన్ను అలరిస్తోంది. నీ మనసు దోచుకోవాలని వచ్చి, నా మనసే నీ దగ్గర పోగొట్టుకున్న అమాయకుణ్ణి! కరుణిస్తావు కదూ?- ఇట్లు నీ 'అజ్ఞాత' ప్రేమికుడు. (నీకున్న అన్నలు, వయసులోని మావయ్యలు, బాబాయ్‌ల గురించి తెలుసుకోకుండా నా వివరాలు ఇవ్వడం దేహానికి ఆరోగ్యకరం కాదని ప్రస్తుతానికి 'అజ్ఞాతం'గానే మిగిలిపోతున్నాను)

- ఆ ఉత్తరం చూసి కోపమూ, నవ్వూ రెండూ వచ్చాయి రజనీకి. ఎవరో మూక్కూ మొహమూ ఎరగని మగవాడు తనకు ప్రేమలేఖ రాసినందుకు కోపమూ, చివరిలో రాసిన 'నోట్' చదివి నవ్వూ వచ్చాయి.

ఉత్తరం చించి ముక్కలు చేసి పారేసింది.

రజని ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. అందంగా వుంటుంది. 'ప్రేమలేఖ' అందుకోవడం అదే మొదటిసారేమో ఆ రోజంతా చికాకుగా అనిపించిందామెకు.

వారం తరువాత రెండో లేఖ వచ్చింది.

"మైడియర్ రజనీ! నీ వివరాలు సేకరించడానికి ఇన్ని రోజులు పట్టింది. అదేమిటో, నిన్ను చూసిన క్షణం నుంచీ నిద్రాహారాలు నా మీద అలిగి తొలగిపోయాయి. శివాలయంలో కాపురముంటూ విష్ణువును పూజించినట్లు, నా మనసు నాలో కొలువుంటూ నిన్నే స్మరిస్తోంది. నిన్ను కలుసుకోవాలనీ, నా హృదయం నీ ముందు పరచుకోవాలనీ తహతహ! ప్లీజ్, ఉత్తరం చింపెయ్యొద్దు. ఎట్‌లీస్ట్ నా కళ్ల ముందే!"

చదవడం ఆపి చటుక్కున చుట్టూ చూసింది రజని. అనుమానస్తులెవరూ కనిపించలేదు. అతనెవరో ఎక్కణ్ణుంచో తనను కనిపెడుతున్నాడని గ్రహించింది. మళ్లీ ఉత్తరంలోకి దృష్టి సారించింది.

"..ఎప్పుడు, ఎక్కడ కలుసుకుందాం? గ్రీన్ సిగ్నల్‌కి ఎదురు చూస్తూ... నీ- రఘు"

ఆ ఉత్తరమూ అక్కడికక్కడే చింపి విసిరేసిందామె కోపంగా.

అయితే- విక్రమార్కుడి వంశంలోని వాడో ఏమో అంతటితో వదల్లేదతను. వారానికో ప్రేమలేఖ రాస్తూనే వున్నాడు ఆమెకు. మొదట్లో ఆమె వాటిని నిర్లక్ష్యం చేసినా, రాను రానూ అతను తన హృదయం గుప్పించి, ప్రేమను చొప్పించి లేఖలు రాస్తుంటే ఆమె హృదయంలో ఎక్కడో సాఫ్ట్ కార్నర్ షేప్ చేసుకోసాగింది అతని పట్ల. ఎలాగో అతని వివరాలు సేకరించి, అతను స్టేట్ గవర్నమెంటులో జూనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడనీ, మనిషి మంచివాడనీ తెలుసుకుంది. మనిషిని చూసి 'హ్యాండ్సమ్‌గానే వున్నాడు' అనుకుంది.

అతని 'వన్-వేలవ్‌'కి ఆర్నెల్ల వయసొచ్చేసింది. స్వయంగా కలుసుకుందామన్న అతని ప్రతిపాదన అంతవరకూ ఫలించలేదు. అతని ఉత్తరాలకు జవాబివ్వదామె. అలాగని వాటిని మునుపటిలా చింపీ పారెయ్యదు. భద్రంగా దాచుకుంటుంది.

ఈసారి అతను రాసిన లేఖ ఆమెను కలవరపరచింది.

"మైడియర్ రజనీ! నా ప్రేమకు ఆర్నెల్ల వయసొచ్చినా ఇంకా పైట వేసుకున్న పాపాన పోలేదు. నా ఆశ అడియాస అవుతుందేమో, భగ్నప్రేమికుల లిస్టులో నేనూ చేరిపోతానేమోనని భయంగా వుంది. అందుకే నా ప్రేమ తాలూకు నిజాయితీని నిరూపించేందుకు ఈ లేఖను నా రక్తంతో రాస్తున్నాను" ఇలా సాగిందది.

అతని మీద ఎనలేని జాలి కలిగింది రజనికి. తన మీద తనకు కోపం కూడా వచ్చింది. ఫలితంగా మూడు రోజుల తరువాత ఓ పార్కులో కలుసుకున్నారిద్దరూ.

"ఆర్నెల్లపాటు సస్పెన్స్‌లో పెట్టి నన్ను ఏడిపించినా, చివరికి నువ్వు నా ప్రేమను అంగీకరించడం-ఏనుగు అంబారీ ఎక్కినంత సంబరంగా వుంది నాకు" అన్నాడతను ఆనందంగా.

"మన పెద్దలతో మాట్లాడి త్వరలోనే మన పెళ్లికి ముహూర్తాలు పెట్టించేస్తాను"

"మీరంతటి సాహసం చేస్తారని వూహించలేదు నేను" అందామె. "లాబ్‌లో మీ ఉత్తరాన్ని టెస్ట్ చేయించి చూసేంతవరకు మీరు నిజంగానే మీ రక్తంతో దాన్ని రాసారంటే నమ్మలేకపోయాను!"

ఆమెను తప్పించి హఠాత్తుగా లేచి నిలుచున్నాడతను- "సారీ, మన పెళ్లి జరగదు!" అన్నాడు.

సీరియస్‌గా వున్న అతని వదనం వంక తెల్లబోయి చూస్తూ, "ఏమయింది, రఘూ? ఎందుకలా వున్నావ్?" అనడిగింది.

"నా రక్తం నిజంగా రక్తంతో రాయబడిందో లేదో తేల్చుకోవడానికి లేబ్‌లో టెస్ట్ చేయించావన్నావు కదూ? అంటే నా మాట మీద నీకు


నమ్మకం లేదన్నమాటేగా?"

"అది... అది... " నసిగిందామె.

"సారీ మేడమ్! నన్ను ప్రేమించని వారినైనా నేను మనస్ఫూర్తిగా ప్రేమించగలను గానీ నా మీద నమ్మకం లేని వారితో మాత్రం జీవితాన్ని పంచుకోలేను. ఆర్నెల్లుగా మనకు పరిచయమున్నా నా మాట మీద నీకు నమ్మకం లేకపోయిందంటే- ఇటీజ్ ఎ పిటీ! గుడ్ బై" అనేసి గబగబగా నడిచి వెళ్లిపోతున్న అతని వంక ప్రాన్పడిపోయి చూస్తూ వుండిపోయింది రజని.

**-తిరుమలశ్రీ** (జంషెడ్పూర్)

# నైజం



**ఆ**ఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే వేళ.

వాహనాలతో రోడ్లన్నీ విపరీతంగా రద్దీగా వున్నాయి. ఎడతెరిపి లేనంతగా కిక్కిరిసి వున్నాయి. ఓ స్టాపులో ఆగిన బస్సు పూర్ణగర్భిణిలా వుంది. అయినా పుష్పక విమానంలా జనాల్ని ఎక్కించుకుని బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

ఇంతలో ఆదరాబాదరాగా బస్సులోకి దూసుకొచ్చిందో మహిళ. చదువూ- సంస్కారం కలిగివున్నట్లే వుంది ఆమె వాలకం. చేతిలో బస్తా అంత బరువున్న హేండుబేగు, చెమటతో తడిసిన శరీరం, అలసటతో ఉసూరుమన్న ముఖం, చెదిరిన కుంకుమ తిలకం, బడలికతో వాలిపోయిన కళ్లతో, చెప్పకనే చెపుతున్నదా వాలకం ఆమె ఉదయం నుండి పనిచేసి అలసిపోయిందని.

బస్‌లో అడుగుపెడుతూనే "అబ్బ!" అంటూ నిట్టూర్చింది.

అటు, యిటు చూసిందామె సీటుకోసం. జనంతోబస్ కిటకిటలాడుతోంది. నిల్చునే ఓపిక లేక అసహనంగా కదిలింది అటు, యిటు.

"ఈ సిటీ బస్ ఎప్పుడూ యింతే! డబ్బులిచ్చి కూడా ఉసూరుమంటూ నిల్చోవల్సిందే!" స్వగతంలో పలికినట్టున్నా ఆ మాటలు ఆమె నిస్త్రాణాన్నీ, నీరసాన్నీ తెలియజేస్తున్నాయి.

కుడిభుజం మీద బరువు ఎడం భుజానికి మార్చుకుని, పమిటతో ముఖం తుడుచుకుని, పైట చెంగు బొడ్డులో దోపుకుని మరోసారి చూసింది ముందూ, వెనకా.

కండక్టరు వెనుక సీట్లో కూర్చున్న ఓ పెద్దమనిషి ఈమె పరిస్థితి చూసి వెంటనే లేచి నించుని-

"కూర్చోండి మేడమ్" అన్నాడు అతని సీటు ఆఫర్ చేస్తూ. పక్కనే మరో ఆసామీ వుండడం వల్ల

"ఇట్సాల్‌రైట్!" అంటూ ఆయన ఖాళీ చేసిన సీటులో ఆ ఆసామి పక్కనే కూర్చుంది. మళ్లీ ముఖం తుడుచుకుంది. ప్రక్కన కూర్చున్న మరో అతను కాస్త యిబ్బందిగా కదిలి లేవబోయాడు.

"మీరు కూర్చోండి. నాకేం యిబ్బంది లేదు. విదేశాల్లో వారి నాగరికతని మనతో పోలిస్తే, మనం చాలా వెనకబడివున్నాం. అందరం ఒకే కుటుంబంలా మెలగాలి, సోదరభావంతో వుండాలి. ఆడ, మగ అంటూ గిరిగీసుక్కూచో కూడదు. అది నాగరికత అనిపించుకోదు. మనసు నిర్మలంగా వుండాలి కాని మనషులెవరైతేనేం? ఆపదలో అవసరంలో సహాయపడ్డమే మానవత్వం! ఆ నైజం అందరూ అలవరచుకోవాలి" అందామె. ఆమెకు మనసుషులపట్ల గల ఉన్నత భావాలు, ఆమె సంస్కారానికి ఎంతో మురిసిపోయేడు ఆ ప్రక్కన కూర్చున్న వ్యక్తి. కాసేపటికి దిగిపోయేడు.

"రైట్! రైట్" కండక్టరు కేకకి కదలబోయింది బస్సు.

"ఆపండాపండి!" అంటూ హడావుడిగా బస్‌లోకి జొరబడ్డాడు ఓ మనిషి. బాగా ఆయాస పడుతున్నాడు. ఆమె పక్కన ఖాళీగా వున్న సీట్లో కూలబడ్డాడు. అతను నిలబడే స్థితిలో లేడు. బాగా జ్వరంగా వుండడం వల్ల తూలుతున్నాడు. గత్యంతరం లేక ఆమె ప్రక్కనే కూలబడి ఒదిగి కూర్చున్నాడు. ఛివాల్న చూసిందామె అతనివైపు.

"ఏంటయ్యా! ఆడామగా తేడా తెలీడం లేదా? మర్యాదకైనా ఓ ముక్క అడక్కుండా గభాల్న అలా కూలబడ్డమేనా? సభ్యతా, సంస్కారం వుండక్కర్లా?" ఆమె చూపులు వాడిగా, ఆమె పలుకులు వేడిగా వున్నాయి.

"క్షమించు తల్లీ! నీ తండ్రిలాంటి వాడిని, నుంచోడానికి ఓపిక లేదు, జ్వరంగా వుంది తల్లీ!"

"అంతలా నుంచో లేకపోతే ఏ ఆటోనో, టాక్సీనో ఎక్కాల్సింది. ఈ సిటీ బస్సే ఎక్కాలా? ఈ బస్సులెప్పుడూ రద్దీగానే వుంటాయ్!" మనుషుల పట్ల, వారి పరిస్థితి పట్ల అవహేళన ఆమె మాటల్లో ధ్వనించింది.

"ఆటోలూ, టాక్సీలు ఎక్కే స్తోమత అందరికీ వుంటదా తల్లీ? ఎంత! ఓ పది నిముషాల్లో దిగిపోతాలే తల్లీ. అందాక కాస్త ఓర్చుకోమ్మా!"

"సర్దుకోక చస్తానా? దిగక ఎవరం వుండిపోతాం బస్సులో. కూర్చున్నప్పుడే వుండాలి ఇంగితం" ఆమె మాటలో ఈసడింపు.

బస్సు కాస్త ఖాళీ అవడంతో ఆ పక్కసీట్లోనే కూర్చొని లెక్కచూసుకుంటున్నాడు కండక్టర్. ఈ తతంగం అంతా వింటున్నాడు. ఇందాకా ఆవిడ మాటలకీ, ఇప్పుడు అదే మనిషి ప్రదర్శించిన సంస్కారం, మనుషుల పట్ల ఏవగింపునకు అర్థం?

ఆమె 'అవకాశవాదానికి' చిన్నగా నవ్వుకున్నాడు. బస్సు ముందుకు సాగిపోతోంది.

**-పూడిపెద్ది నీలవేణి**
(శృంగవరపుకోట)